క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత

నల్లగొండ రూరల్ : నల్లగొండ మండలంలోని చెన్నారం గ్రామానికి చెందిన అయితగోని రాములమ్మ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని ఆర్‌కేఎస్ ఫౌండేషన్ చైర్మన్ పిల్లి రామరాజుయాదవ్ సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఐక్కయ్య, మహేందర్, గంగరాజు, శ్రీనివాస్, భాస్కర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

22న పంచాంగ శ్రవణం

నకిరేకల్ : ఉగాది పండుగను పురస్కరించుకుని నకిరేకల్‌లోని ఆఫీసర్స్ క్లబ్ ఆవరణలో ఈ నెల 22న సాయంత్రం 4 గంటలకు పంచాంగ శ్రవణం, 6 గంటలకు కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు పొట్లబత్తుల పార్థసారథి, ప్రధాన కార్యదర్శి నాయిని మధు మంగళవారం తెలిపారు. ఉగాది కవితలు పంపేవారు ఈ నెల 20 సాయంత్రంలోపు క్లబ్‌లో అందజేయాలని కోరారు.

ఎమ్మెల్యే పరామర్శ

రామగిరి(నల్లగొండ) : తిప్పర్తి మండలం పజ్జూరుకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు రాగి కేశవులు కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుండడంతో మంగళవారం ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పరామర్శించారు. ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకుని అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట సర్పంచ్ ఎస్‌కె.మోయిజ్, పాక్స్ చైర్మన్ పాశం సంపత్‌రెడ్డి, రాగి మురళి తదితరులు ఉన్నారు.

జీవన నైపుణ్యాలపై అవగాహన

చిట్యాల : మండలంలోని వెలిమినేడు జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు మంగళవారం జీవన నైపుణ్యాలపై ప్రముఖ సైకాలజిస్ట్ లైఫ్ స్కిల్స్ ట్రైనర్ డాక్టర్ నకిరేకంటి శ్రీధర్ అవగాహన కల్పించారు. జ్ఞాపకశక్తితోపాటు ఇతర నైపుణ్యాల పెంపునకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నర్సిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు

మర్రిగూడ : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో నేటి నుంచి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, గురువారం నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్ష కేంద్రంలో మొత్తం 524మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పాఠశాలలో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు మంగళవారం పూర్తి చేశారు. పరీక్షల నిర్వహణ సీఎస్‌గా ఎస్.శివస్వరూపరాణి, డీఓ గణేశ్ వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా సీఎస్ శివస్వరూపరాణి మాట్లాడుతూ విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రవీణ్, సిబ్బంది ఉన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

కట్టంగూర్ : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని నల్లగొండ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ లోకసాని వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించి రోగుల వివరాలు, రికార్డులను పరిశీలించారు. జిల్లాలో ఆరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆరోగ్య మహిళ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి శ్వేత, స్టాఫ్ నర్స్ జోస్పిన్, సిబ్బంది ఉన్నారు.

సివిల్ సర్వీసెస్‌లో రాణించాలి

రామగిరి(నల్లగొండ) : గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు సివిల్ సర్వీసెస్‌లో రాణించాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్ అన్నారు. ఎన్జీ కళాశాల పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం భారత రాజ్యాంగ విశిష్టత అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. పొలిటికల్ సైన్స్ విభాగం ఇన్‌చార్జ్ శీలం యాదగిరి, అధ్యాపకులు యాదగిరిరెడ్డి, ఏ.మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం

చండూరు : మండల పరిధిలోని తేరట్‌పల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం గణితం పై డే ను ఘనంగా నిర్వహించారు. పై డే విశిష్టతపై విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌రెడ్డి, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదావత్ లచ్చిరాంనాయక్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయిరాం, నర్సింహ, రాణి, ట్యూటర్స్ సుష్మ, సుప్రియ, విద్యార్థులు పాల్గొన్నారు.


తేరట్‌పల్లి పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

రోడ్డు నిర్మాణం పూర్తయ్యేదెప్పుడు!

- ఏడాదికిపైగా సాగుతున్న పనులు
- దుమ్ము, ధూళితో ప్రజల ఇబ్బందులు
- ప్రమాదాలబారిన పడుతున్న వాహనదారులు


వాహనాల రాకపోకలతో వెలువడుతున్న దుమ్ము


ధర్నా నిర్వహిస్తున్న వాహనదారులు (ఫైల్)

మర్రిగూడ : మాల్ నుంచి మర్రిగూడకు వచ్చే రహదారి నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పనులు పూర్తి చేయాలని మాల్ గ్రామ ప్రజలతోపాటు వాహనదారులు పలుమార్లు ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. అయినా పనులు పూర్తి చేయడంతో అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

ఫిబ్రవరి 2022లో పనులు ప్రారంభం

మాల్ నుంచి మర్రిగూడకు వచ్చే కిలోమీటరున్నర డబుల్ రోడ్డు గతంలో గుంతలమయంగా ఉండేది. దీంతో ఫిబ్రవరి 2022లో దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. పనులు మాత్రం ప్రారంభం కాలేదు. జూన్‌లో కొంత పనులు ప్రారంభించినట్లు చేసి జూలై నెలలో పూర్తిస్థాయిలో ప్రారంభించారు. అనంతరం అప్పుడప్పుడు ప్రారంభించడం మళ్లీ నిలిపివేయడం జరుగుతోంది. మాల్ నుంచి మర్రిగూడ 15కి.మీ దూరం ఉంటుంది. మండలంలోని తిరగండ్లపల్లి, మాల్ గ్రామాల సరిహద్దులు రెవెన్యూపరంగా కలిసే ఉంటాయి. మర్రిగూడ మండలంలోని పలు గ్రామాల ప్రజలు వ్యక్తిగత పనుల నిమిత్తం నిత్యం వందల సంఖ్యలో మాల్‌కు వెళ్లి వస్తుంటారు.

కిలోమీటరున్నర నరకప్రాయం

కిలోమీటరున్నర ప్రయాణం వాహనదారులకు నరకంగా మారింది. వాహనాల రాకపోకలతో రోడ్డుపై పోసిన కంకర, డస్ట్ విపరీతంగా వచ్చి ప్రయాణికులపై పడుతుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుమ్ము, ధూళితో ఊపిరితిత్తుల వ్యాధుల బారిన పడుతామోనని స్థానికులు వాపోతున్నారు.

ప్రమాదాలు... ఇబ్బందులు

మాల్–మర్రిగూడ రోడ్డు పనులు పూర్తికాకపోవడంతో అనేకమంది వాహనదారులు ప్రమాదాలకు గురై ఆస్పత్రుల పాలవుతున్నారు. ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురై మృత్యువాత పడ్డాడు. ఇటీవల కాలంలో రెండు ద్విచక్ర వాహనాలు అదుపుతప్పడంతో ఒకరికి తీవ్ర గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బిల్లులు సకాలంలో అందకపోవడంతోనే పనుల్లో జాప్యం జరుగుతున్నట్లు సదరు కాంట్రాక్టర్ పేర్కొంటున్నాడు. మాల్ నుంచి మర్రిగూడ కిలోమీటన్నర రెండు వరుసల రహదారిని సకాలంలో పూర్తి చేసి ప్రమాదాల నుంచి కాపాడాలని వాహనదారులు కోరుతున్నారు. పాత మాల్‌లో నివసించే తమకు పునరావాసం కల్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను సంప్రదించగా వారం రోజుల్లో బీటీ పూర్తి చేస్తామని తెలిపారు.

ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి



రహదారి పనులు ఏడాది దాటినా పూర్తికాకపోవడం బాధాకరం. కాంట్రాక్టర్‌ను అడిగితే బిల్లులు చెల్లించడం లేదంటున్నారు. ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి పనులు సకాలంలో పూర్తయ్యేలా చొరవ చూపాలి.
– చల్లం పాండురంగారావు, తమ్మడపల్లి

వాహనాలు దెబ్బతింటున్నాయి



మర్రిగూడ నుంచి మాల్‌కు ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నా. దారి బాగోలేకపోవడంతో వాహనాలు దెబ్బతింటున్నాయి. రోజుకు రెండు ట్రిప్పులు మాత్రమే వెళ్లి వస్తున్నాం. దీంతో కనీసం కూలీ కూడా గిట్టుబాటు కావడం లేదు.
– ఎడ్ల చంద్రమౌళి, రాంరెడ్డిపల్లి, ఆటో డ్రైవర్

దుమ్ముతో ఇబ్బందులు పడుతున్నాం



ఇళ్లలో ఉన్నా కానీ దుమ్ము పడుతుండడంతో ఇబ్బందులు పడుతున్నాం. బయటకు కూరగాయలకు వెళ్లాలన్నా మాస్కు పెట్టుకుని, టవల్ చుట్టుకుని వెళ్లాల్సి వస్తోంది. రోడ్డు బాగు చేసి దుమ్ము, ధూళి నుంచి మమ్మల్ని కాపాడాలి.
– గొల్లపల్లి అలివేలు, పాత మాల్

మహిళలు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలి

- ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి


బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : మహిళలు స్వయం ఉపాధి పొందడంతోపాటు నలుగురికి ఉపాధి అవకాశాలు కల్పించే స్థాయికి ఎదిగి ఆర్థిక పరిపుష్టి సాధించాలని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. నీలగిరి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవం ముగింపు కార్యక్రమం మంగళవారం నల్లగొండలోని పోలీస్ ఆడిటోరియంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ..మహిళల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం వారం రోజుల పాటు నిర్వహించిన రంగోలి, మెహందీ, కుకింగ్ తదితర పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. అంతకుముందు మున్సిపల్ కార్యాలయం నుంచి పోలీస్ ఆడిటోరియం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ కేవీ.రమణాచారి, నాయకులు కటికం సత్తయ్యగౌడ్, చీర పంకజ్‌యాదవ్, బషీర్, అసిస్టెంట్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, ఏసీపీ నాగిరెడ్డి, మెప్మా టీఎంసీ శ్రీనివాస్, సీఓలు జ్యోతి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేయాలి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి

నకిరేకల్ : నకిరేకల్ నియోజకవర్గంలో బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. నకిరేకల్‌లో మంగళవారం స్వశక్తికరణ అభియాన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడుతూ శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లు ఈ నెల 15 నుంచి 25 వరకు పల్లెల్లో పర్యటించాలని సూచించారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మైల నర్సింహ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు నకిరేకంటి మొగిలయ్య, గోలి ప్రభాకర్, అయితగోని అనిత, మండల వెంకన్న, పల్స శ్రీనుగౌడ్, వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రావు, ఏలూరు శ్యాం, తాటిపాముల శివకృష్ణ, యానాల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విలీన గ్రామాలను అభివృద్ధి చేస్తాం


9 వార్డులో స్థానికులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రమణాచారి

నల్లగొండ టూటౌన్ : విలీన గ్రామాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేస్తామని నల్లగొండ మున్సిపల్ కమిషనర్ కేవీ. రమణాచారి అన్నారు. వార్డ్ వాచ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నల్లగొండ పట్టణంలోని వివిధ వార్డుల్లో అధికారులతో కలిసి పర్యటించారు. రాబోయే ఆరు నెలల్లో విలీన గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని అన్నారు. 9వ వార్డు గంధంవారిగూడెం, లాలాయిగూడెం, లింగప్పగూడెంలో పర్యటించి నీటి సమస్యపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఆయా గ్రామాల్లో నీటి సమస్య రాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అమృత్ స్కీం కింద రూ. 56 కోట్లు మంజూరయ్యాయని, నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా శాశ్వత పరిష్కారం చేపట్టనున్నట్లు కమిషనర్ తెలిపారు. అదేవిధంగా 4, 16వ వార్డుల్లోని కేశరాజుపల్లి, చంద్రగిరి విలాస్‌లలో కంటి వెలుగు శిబిరాలను తనిఖీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ ఈఈ రాములు, ఏసీపీ నాగిరెడ్డి, డీఈలు అశోక్‌కుమార్, నరసింహారెడ్డి, వెంకన్న, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మూర్తుజాఅలీ, శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

‘షర్మిలను అరెస్ట్ చేయడం దుర్మార్గం’

నల్లగొండ టూటౌన్ : ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద దీక్ష చేపట్టిన వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్.షర్మిలను అరెస్ట్ చేయడం దుర్మార్గమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పర్వతం వేణు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై దీక్ష చేస్తుంటే పోలీసులు అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

షర్మిల అరెస్ట్‌ను ఖండించాలి

చిట్యాల : కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ దేశ రాజధాని ఢిల్లీలో ధర్నా చేపట్టిన వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల అరెస్ట్‌ను ప్రతిఒక్కరూ ఖండించాలని ఆ పార్టీ నకిరేకల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ పోకల అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో జరుగుతున్న అవినీతిని ప్రజలు గమనించాలన్నారు.

ఘనంగా రథోత్సవం

మర్రిగూడ : మండలంలోని తమ్మడపల్లిలో శ్రీఅలివేలుమంగాపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు, గ్రామస్తులు స్వామివారికి కట్నకానుకలు సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఎంపీటీసీ గండికోట రాజమణిహరికృష్ణ భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొట్టం మాధవిరమేష్, కొట్టం శివయాదవ్, ఎంజాల యాదగిరి, మహ్మద్ రజాక్, గిరి, నర్సింహ, యాదగిరి, లింగస్వామి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్


కేతేపల్లిలో పోలీసుల అదుపులో బీజేపీ నాయకులు

కేతేపల్లి : బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌పై బీఆర్‌ఎస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ధర్నాకు వెళ్తున్న మండల బీజేపీ నాయకులను కేతేపల్లి పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయినవారిలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు అయితగోని అనిత, నాయకులు తాడోజు నర్సింహాచారి, జటంగి రాంచంద్రయ్య, ఎ.చంద్రశేఖర్, సమ్మెట విజయలక్ష్మి, వి.నాగయ్య తదితరులు ఉన్నారు.

మర్రిగూడ : టీఎస్‌పీఎస్సీలో పేపర్ లీక్ వ్యవహారంపై ఆందోళనలు చేస్తారనే సమాచారంతో మండలంలోని బీజేపీ నాయకులను మంగళవారం పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీజేపీ గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు రాజేంద్రనాయక్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం బీజేపీ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయిస్తోందని అన్నారు. టీఎస్‌పీఎస్సీలో పేపర్ లీక్ వ్యవహారంలో విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి ప్రమేయం ఉందని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకటంపేట బాలయ్య, లింగస్వామి, బోయపల్లి శ్రీరామ్‌గౌడ్ పాల్గొన్నారు.

నకిరేకల్‌లో కాంగ్రెస్ గెలుపు ఖాయం


మాట్లాడుతున్న కొండేటి మల్లయ్య

నకిరేకల్ : రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో, నకిరేకల్‌లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య అన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నకిరేకల్ కాంగ్రెస్ పార్టీ టికెట్‌ను గెలిచే వారికే సర్వేల ఆధారంగా అధిష్టానం ఖరారు చేస్తుందన్నారు. నియోజకవర్గంలో ఎలాంటి గ్రూపులు లేవని, టికెట్ ఎవరికి ఇచ్చినా అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటామన్నారు. ఇటీవల మహిళలను ఉద్దేశించి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య వ్యాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు. ఈ సమావేశంలో నాయకులు పన్నాల రాఘవరెడ్డి, యాసా కరుణాకర్‌రెడ్డి, రాచకొండ లింగయ్య, చంద్రశేఖర్, బొంబాయి శ్రీను, కొండ అంజమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కనగల్ : చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతిచెందిన గంటా శ్రీనుకు కుమారులు లేకపోవడంతో పెద్ద కుమార్తె పూజిత మంగళవారం తండ్రికి తలకొరివి పెట్టింది. శ్రీనుకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

శ్రీను కుటుంబానికి ఆర్థికసాయం

మండల పరిధిలోని జి యడవల్లి గ్రామానికి చెందిన గంటా శ్రీను చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతిచెందిన విషయం విదితమే. విషయం తెలుసుకున్న భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంగళవారం కాంగ్రెస్ పార్టీ కనగల్ మండలాధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి ద్వారా రూ.50 వేల ఆర్థికసాయం అందజేశారు. పోలె విజయ్‌కుమార్, పర్సనబోయిన ఉషయ్య, బొమ్మకంటి భిక్షంలు ఉన్నారు.

రూ.20 వేలు అందించిన ఎమ్మెల్యే కంచర్ల

శ్రీను కుటుంబానికి ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి రూ.20 వేల ఆర్థికసాయాన్ని ఎంపీపీ కరీంపాష, జెడ్పీటీసీ చిట్ల వెంకటేశం ద్వారా అందజేశారు. వారి వెంట వైస్ ఎంపీపీ రామగిరి శ్రీధర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్లు వంగాల సహదేవరెడ్డి, దోటి శ్రీనివాస్, రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు ఎర్రబెల్లి నర్సిరెడ్డి, మత్స్యశాఖ చైర్మన్ బొమ్మరబోయిన భార్గవ్, కానుగు భూపాతి ఉన్నారు.

రూ.10 వేలు అందించిన పిల్లి రామరాజు

శ్రీను కుటుంబానికి బీఆర్‌ఎస్ పార్టీ నల్లగొండ పట్టణ కౌన్సిలర్ పిల్లి రామరాజు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అదేవిధంగా రాంచంద్రపురంలో ఇటీవల మృతి చెందిన వల్కి సాయమ్మ కుటుంబానికి రూ.10 వేలు అందజేశారు. అదేవిధంగా శ్రీను కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర నాయకురాలు కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం


నకిరేకల్ : దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్‌వీ నాయకులు

నకిరేకల్ : యూనివర్సిటీ కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు బిల్లుకు గవర్నర్ వెంటనే ఆమోదం తెలపాలని కోరుతూ నకిరేకల్‌లో బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో మంగళవారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ కొమ్మనబోయిన సైదులుయాదవ్ మాట్లాడుతూ బిల్లులను వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాద ఎల్లేష్, కొణతం శౌర్య, పాలడుగు సంపత్, అనుముల శ్రీకాంత్, నాగరాజు, సింగం శివ, మాచర్ల కిరణ్, భాను, సాయి తదితరులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన

నల్లగొండ టూటౌన్ : యూనివర్సిటీల్లో నియామకాల కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ బిల్లును గవర్నర్ ఆమోదించాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున మాట్లాడుతూ గవర్నర్ తమిళిసై రాజ్యాంగ పదవిలో ఉండి బీజేపీ నాయకురాలిగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గవర్నర్ వెంటనే బిల్లు ఆమోదించాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్వీ నాయకులు నోముల క్రాంతియాదవ్, అరవింద్, పాండు, శివకుమార్, నాగరాజు, సురేందర్, పవన్, గణేశ్, శంకర్ పాల్గొన్నారు.

హత్యాయత్న నిందితులను కఠినంగా శిక్షించాలి

కేతేపల్లి : తన ఇంటిని ధ్వంసం చేసి తనపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితులపై పోలీసులు కఠినంగా చర్యలు తీసుకోవాలని తుంగతుర్తి సింగిల్‌విండో డైరెక్టర్ అలుగుబెల్లి సంజీవరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మండలంలోని తుంగతుర్తి గ్రామంలో తన భార్య, మాజీ సర్పంచ్ అలుగుబెల్లి లక్ష్మితో కలిసి విలేకరులతో మాట్లాడారు. తాను గతంలో మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం అనుచరుడిగా ఉన్నానని, అనంతరం కాంగ్రెస్ పార్టీలో ఉన్న తాను ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య చేస్తున్న అభివృద్ధిని చూసి ఇటీవల బీఆర్‌ఎస్ పార్టీలో చేరానని తెలిపారు. ఈ విషయం జీర్ణించుకోలేని వేముల వీరేశం అనుచరులు పలువురు మహిళలతో కలిసి తనతోపాటు తన భార్యను హత్య చేయాలనే కుట్రతో శనివారం తన ఇంటిపై దాడి చేశారని ఆరోపించారు. ఆ సమయంతో తాము ఇంటిలో లేకపోవడంతో ప్రహరీ ధ్వంసం చేశారని పేర్కొన్నారు. తమపై జరిగిన దాడి సంఘటనపై జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

ముగిసిన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

చండూరు : గట్టుప్పల్ మండలం నామాపురం గ్రామంలోని శ్రీ మహాలక్ష్మి దేవస్థానంలో మూడు రోజులుగా జరుగుతున్న ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలు మంగళవారం ముగిశాయి. హైదరాబాద్‌కు చెందిన కొట్టి చంద్రప్రకాష్–అరుణ దంపతుల సహకారంతో జరిగిన ఈ వేడుకల్లో నామాపురం, చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. యాగమండప దేవత హోమాలు, మూలమంత్ర ఘర్తన్యాస హోమం, యంత్ర స్థాపన, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కలాన్యాస హోమాలు, పూర్ణాహుతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వేడుకల్లో ధర్మకర్త బహుగానం సుబ్రహ్మణ్యశర్మ, ఆలయ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


హోమం చేస్తున్న అర్చకులు

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం


నల్లగొండ : విద్యార్థులతో ఉపాధ్యాయులు


చండూరు సన్‌షైన్ పాఠశాలలో..


కట్టంగూర్ సాందీపని పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయులు

నల్లగొండ : పట్టణంలోని పద్మానగర్‌లో గల మిర్యాల కమలమ్మ–వెంకటేశం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా, అధికారులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా డీఈఓ భిక్షపతి, ఎంఈఓ నర్సింహ పాఠశాలను సందర్శించి విద్యార్థుల బోధన తీరును పరిశీలించి అభినందించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నవ్వ ధమనేశ్వరరావు, ఉపాధ్యాయులు ఉమారాణి, కృష్ణప్రియ, వెంకటరమణ, నరేష్, హేమమాలిని విద్యార్థులు పాల్గొన్నారు.

చండూరు : స్థానిక సన్‌షైన్ పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ కోడి వెంకన్న బహుమతులు అందించారు. డైరెక్టర్ కోడి సుష్మ, ప్రిన్సిపాల్ రవికాంత్, లతీఫ్ పాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కట్టంగూర్ : మండల కేంద్రంలోని సాందీపని అప్పర్ ప్రైమరీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఉత్తమ ఉపాధ్యాయుగా ఎంపికైన వారికి పాఠశాల హెచ్‌ఎం బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు గట్టిగొర్ల యాదగిరి, సంపత్, వెంకటప్రసాద్, వీరస్వామి, పద్మ, నాగమణి, రేణుక, అనిత, మంగ, సరిత, పూజ, ఆకాంక్ష తదితరులు ఉన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

మాడుగులపల్లి : క్షయవ్యాధిపై అవగాహన అవసరమని జెడ్పీటీసీ పుల్లెంల సైదులు, సర్పంచ్ శోభ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో వైద్య సిబ్బంది క్షయవ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. 15రోజులు మించి దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం లాంటి లక్షణాలు కనిపిస్తే క్షయ పరీక్ష చేయించుకోవాలని సూచించారు.

మంత్రి ప్రశాంత్‌రెడ్డికి ఎమ్మెల్యేల శుభాకాంక్షలు





రోడ్లు భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, రవీంద్రకుమార్, భాస్కర్‌రావు నల్లగొండ జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి
– నకిరేకల్, నల్లగొండ

‘టీఎస్‌పీఎస్సీ చైర్మన్ రాజీనామా చేయాలి’

రామగిరి(నల్లగొండ) : టీఎస్‌పీఎస్సీ ఉద్యోగాల పరీక్ష పత్రాల లీకేజీ వ్యవహారంలో నిర్లక్ష్యం వహించిన చైర్మన్ బేషరతుగా పదవికి రాజీనామా చేయాలని నిరుద్యోగ జేఏసీ నాయకుడు పాల్వాయి రవి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ ఉద్యోగులు డబ్బులకు ఆశపడి పరీక్ష పత్రాలను అమ్ముకోవడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఎర్రమాద శ్రీనివాస్, గొబ్బిల అనిల్‌కుమార్, సంతోష్, శివ శంకర్ పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలి

నల్లగొండ రూరల్ : టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన అన్ని పరీక్షలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర నాయకుడు పందుల సైదులుగౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాటి నుంచి, నేటి వరకు టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన అన్ని పరీక్షలపై అనుమానాలు ఉన్నాయని అన్నారు.

బోర్డును రద్దు చేయాలి

నకిరేకల్ : టీఎస్‌పీఎస్సీ బోర్డును తక్షణమే రద్దు చేయాలని ఎన్‌ఎస్‌యూఐ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అల్లి అంజన్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నకిరేకల్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎలాంటి అనుభవం లేని వారిని బోర్డు మెంబర్లుగా పెట్టుకుని పరీక్ష పేపర్లు లీకేజీ చేసి నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని అన్నారు.

‘తెలంగాణ ఉద్యమ సమయంలో నష్టపోయా’

నల్లగొండ రూరల్ : సీఎం కేసీఆర్‌ను నమ్మి తెలంగాణ ఉద్యమ సమయంలో రూ.వంద కోట్లు నష్టపోయానని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చకిలం అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం నల్లగొండ మండలంలోని పెద్ద సూరారంలో పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నిర్ణయం మేరకు పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసినా తనకు ఎలాంటి ఫలితం దక్కలేదని అన్నారు. తాను ఏ పార్టీలోకి వెళ్లినా అండగా ఉండాలని, వచ్చే ఎన్నికల్లో తాను కచ్చితంగా పోటీ చేస్తానని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో లింగస్వామి, నర్సింహ, రాజా ప్రజాపతి, కన్నారావు, రంజిత్, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.